పర్యావరణ హితమే ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, న్యూస్‌టుడే: పర్యావరణ హితమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం సాయంత్రం హుస్నాబాద్ పట్టణంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కలిసి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ కూడలి సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. వికలాంగులకు ద్విచక్రవాహనాలు పంపిణీ చేశారు. ఎల్లమ్మచెరువు మత్తడి సమీపంలో రూ.1.10కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ ప్లాంటులో ఎరువు తయారవుతుందని, పంట పొలాలకు ఉపయోగపడుతుందన్నారు. హుస్నాబాద్ పట్టణంలో డ్రైనేజీ సమస్య పరిష్కారం చేస్తామని, సుందరీకరణ పనులు పూర్తి చేస్తామన్నారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. రూ.2కోట్లతో హుస్నాబాద్‌లో కూడళ్ల సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. గాంధీ జయంతి సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమాలకు పురాధ్యక్షురాలు ఆకుల రజిత అధ్యక్షత వహించగా ఆర్డీవో రామమూర్తి, కమిషనర్ మల్లికార్జునగౌడ్, సహకార సంఘం ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, పుర ఉపాధ్యక్షురాలు ఐలేని అనిత, తహసీల్దారు రవీందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు బస్వరాజ్ శంకర్, డీసీసీ కార్యదర్శి చిత్తారి రవీందర్, సామాజిక సేవకురాలు కర్నకంటి మంజుల, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం హుస్నాబాద్‌లో జరిగిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.


హుస్నాబాద్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి

వంట నిర్వాహకులకు ఊరట

● బకాయి బిల్లులు, గౌరవ వేతనం విడుదల

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండుతున్న మహిళలకు ఊరట లభించింది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పెండింగులో ఉన్న బకాయిలను విడుదల చేసింది. జూన్ నుంచి ఆగస్టు వరకు జిల్లాకు రావాల్సిన మొత్తం రూ.2.03 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.


కట్కూర్‌లో వంట చేస్తున్న మహిళలు

నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ

జిల్లాలో 938 వరకు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో లక్షకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి పాఠశాలలో రోజూ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఈ వంట చేసే మహిళలకు ఈ ఏడాది జూన్ నుంచి బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రతినెలా బిల్లులు చెల్లించకపోవడంతో నిర్వాహక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలతో గిట్టుబాటు కావడం లేదు. దీనితో వారు అప్పులు తెచ్చి వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారి పరిస్థితిని తెలుసుకున్న ప్రభుత్వం నిర్వాహకులకు రావాల్సిన వంట ఖర్చులతో పాటు గౌరవ వేతనాన్ని విడుదల చేసింది. మూడు నెలలకు సంబంధించి రూ.2.03 కోట్లు విడుదలయ్యాయి. అందులో వంట ఖర్చులు రూ.57.31లక్షలు, గౌరవ వేతనం రూ.92.86లక్షలు ఉన్నాయి. వీటిని నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేసింది.

కోడిగుడ్ల మొత్తం చెల్లింపు

మధ్యాహ్న భోజనంలో భాగంగా విద్యార్థులకు వారానికి మూడుసార్లు కోడిగుడ్లు అందిస్తున్నారు. వీటి బిల్లులు కూడా చెల్లించక పోవడంతో నిర్వాహకులు ఇబ్బంది పడ్డారు. బహిరంగ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.6 ఉండగా ప్రభుత్వం వంట చేసే మహిళలకు రూ.5 చొప్పున మాత్రమే చెల్లిస్తున్నారు. అది కూడా నెలనెలా చెల్లించడం లేదు. దీనితో మహిళలు అప్పు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పెండింగులో ఉన్న కోడిగుడ్లకు సంబంధించిన బిల్లులు కూడా వచ్చాయి. జూన్ నుంచి గత నెల వరకు వారికి రావాల్సిన రూ.53.01లక్షలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని ఎస్టీవో ద్వారా మహిళల ఖాతాల్లో జమచేశారు. గత విద్యాసంవత్సరం బకాయిలు ఈ ఏడాది జూన్‌లో విడుదలైన విషయం తెలిసిందే. తాజాగా ఆగస్టు వరకు బిల్లులు చెల్లించడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విడుదలైన బిల్లుల వివరాలు

జిల్లాలో పాఠశాలలు	938
వంట ఖర్చులు:	రూ.57.31 లక్షలు
గౌరవ వేతనాలు:	రూ.96.86 లక్షలు
కోడిగుడ్ల బిల్లులు:	రూ.53.01 లక్షలు

తొలిరోజే తరలివచ్చి..

● 229 మంది హాజరు

● డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన షురూ..

న్యూస్‌టుడే, సిద్దిపేట: డీఎస్సీ-2024 పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమైంది. మొదటి రోజు సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ)లతో ప్రక్రియ ఆరంభమైంది. స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) అభ్యర్థులకు సంబంధిత పరిశీలన గురువారం నుంచి మొదలవనుంది. సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వేదికగా తొలి రోజు చేపట్టిన క్రతువుకు దాదాపు 229 మంది హాజరయ్యారు. ఒక్కో పోస్టుకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగించనున్నారు. తనిఖీల్లో భాగంగా ఒక్కో బృందంలో ఇద్దరు చొప్పున పీజీ హెచ్ఎంలు భాగస్వాములయ్యారు. బుధవారం తరలివచ్చిన అభ్యర్థులకు టోకెన్లు జారీ చేశారు. తరువాత రిజిస్ట్రేషన్ చేసి కౌంటర్లు కేటాయించారు. ఆ మేరకు అభ్యర్థుల ధ్రువపత్రాల ధ్రువీకరణ నిర్వహించారు. అభ్యర్థుల సందేహాల నివృత్తికి గ్రీవెన్స్ విభాగాన్ని అందుబాటులోకి తెచ్చారు.

జిల్లాలో ఇలా..

భర్తీ చేయనున్న పోస్టులు:	311
ఎస్జీటీ:	157
ఎస్ఏ:	154
హాజరవనున్న అభ్యర్థులు:	933

నిర్వహణ ఏర్పాట్లు..

సమయం:	ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
కౌంటర్లు:	12
సభ్యులు:	24
తనిఖీ బృందాలు:	12
డీఈవో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది:	10

ఇవి తప్పనిసరి..

విద్యార్హతను తెలిపే అన్ని ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్ల ప్రతులను(గెజిటెడ్ అటెస్టేషన్‌తో కూడినవి) సమర్పించాలి. www.deosiddipet.in వెబ్‌సైట్‌ను సందర్శించి చెక్‌లిస్టు దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని పూరించాలి. పాస్ ఫొటోను జత చేయాలి. దాంతో పాటు డీఎస్సీ హాల్‌టికెట్, కులం, ఒకటి నుంచి ఏడో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, పదో తరగతి, ఇంటర్ ధ్రువపత్రాలు, గ్రాడ్యుయేషన్, పీజీ, ప్రొఫెషనల్ సంబంధిత మెమో, ప్రొవిజినల్స్ తప్పనిసరి. టెట్ మార్కులు, ఆధార్, డీఎస్సీ-2024 ర్యాంకు కార్డు ఉండాలి. ఇప్పటికే ఉద్యోగి అయితే ఎన్వోసీ, అర్హత మేర పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్, ఎక్స్ సర్వీసుమెన్, క్రీడా సంబంధిత ధ్రువపత్రాలు అందించాలి. తనిఖీ పూర్తయిన తరువాత డీఈవో కార్యాలయ అధికారులు హైదరాబాద్ డీఎస్ఈ కార్యాలయానికి వివరాలు పంపించనున్నారు. అక్కడి నుంచి తుది జాబితా వెలువరించనున్నారు. మరోవైపు బుధవారం సాయంత్రం వరకు ఎస్ఏ అభ్యర్థుల 1:3 నిష్పత్తిలో జాబితా రాకపోవడంతో పలువురు కేంద్రం వరకు వచ్చి వెనుదిరిగారు.

తీరనున్న కొరత..

జిల్లాలో ఉపాధ్యాయుల కొరత కొన్నేళ్లుగా వేధిస్తోంది. విద్యార్థులున్నా సరిపడా ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఈ తరుణంలో ఈనెల 9వ తేదీన పోస్టింగ్ కేటాయించి, శిక్షణలు అందిస్తే ఇబ్బందులు తీరనున్నాయి.


రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్న సిబ్బంది

సకాలంలో హాజరుకావాలి

– డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గణాంక అధికారి నర్సింలు

అభ్యర్థులు నిర్దేశిత ధ్రువపత్రాలతో సకాలంలో హాజరుకావాలి. మరిన్ని వివరాలు, తాజా సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి. నిర్దేశిత తేదీల్లో రద్దీ ఎక్కువగా ఉంటే టోకెన్లు జారీ చేసి మరుసటి రోజుకు అవకాశం కల్పిస్తాం.

పూల తల్లి.. భక్తుల కల్పవల్లి..

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ సంబురాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీల్లో మహిళలు, యువతులు, చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేస్తూ బతుకమ్మ ఆడారు. అనంతరం సిద్దిపేటలోని కోమటిచెరువు, ఎర్రచెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.


సిద్దిపేట కోమటిచెరువులో నిమజ్జనం చేస్తూ..



చేర్యాల: శ్రీనగర్‌కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

గజ్వేల్, న్యూస్‌టుడే: భారాస నేతలను విమర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులకు పేదలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌ను నోటికొచ్చినట్లు మాట్లాడటం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి మంజూరు చేసిన రూ.170 కోట్ల నిధులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని, స్థానిక నాయకులు బాధ్యత తీసుకొని పనులు చేపడితే బాగుంటుందని అన్నారు. ఆరు గ్యారెంటీలపై ప్రజలు నిలదీస్తారనే భయంతో హైడ్రాను తీసుకొచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి, వైస్ ఛైర్మన్ జకీ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గజ్వేల్‌లో ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి తదితరులు నివాళులర్పించారు.


గజ్వేల్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజమౌళి

అన్ని విధాలా ఆదుకుంటాం

గజ్వేల్, న్యూస్‌టుడే: మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్వాసితులను ఆదుకునే బాధ్యతను గత ప్రభుత్వమే విస్మరించిందని.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పది నెలలే అయిందని.. నిర్వాసితులను ఆదుకునేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును విమర్శించే స్థాయి వంటేరు ప్రతాప్‌రెడ్డికి లేదన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ నియోజకవర్గానికి గత ప్రభుత్వం కేవలం ప్రొసీడింగ్‌లు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టిందన్నారు. సమావేశంలో గజ్వేల్ ఏఎంసీ ఛైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ భాస్కర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

వర్గల్: ఆహారశుద్ధి పరిశ్రమల్లో భాగంగా టీజీఐఐసీలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేస్తామని తూముకుంట నర్సారెడ్డి హామీ ఇచ్చారు. భూ నిర్వాసితుల శిబిరం వద్దకు బుధవారం వచ్చి వారితో మాట్లాడారు. రైతుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఊరెళ్తున్నారా.... జాగ్రత్తలు తీసుకోండి: సీపీ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా సెలవుల్లో స్వగ్రామాలకు వెళ్లేవారు దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ అనూరాధ సూచించారు. ఊళ్లకు వెళ్లేవారు ఆయా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని, పరిసరాల్లో సీసీ కెమెరాలు బిగించుకోవాలన్నారు. పోలీసు శాఖ తరఫున కూడా భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విలువైన వస్తువులు పక్కింటి వారికి ఇచ్చి మోసపోవద్దని.. బ్యాంకు లాకర్లలో పెట్టి వెళ్లాలన్నారు. ఇంటికి వేసిన తాళం కనిపించకుండా కర్టెన్ వేయాలని.. ఏదో ఒక గదిలో లైట్లు వేసి ఉంచాలని సూచించారు. ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఇంటికి సంబంధించిన వివరాలు, ఫోన్ నంబరు తప్పకుండా పోలీసులకు తెలపాలని. అత్యవసర సమయాల్లో డయల్ 100, పోలీస్ కంట్రోల్ రూమ్ 87126 67100కు సమాచారం అందించాలని సూచించారు.


సీపీ అనూరాధ

దిల్లీలో స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్న కమిషనర్

సిద్దిపేట, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా చేపట్టిన కార్యక్రమాల్లో ప్రజా భాగస్వామ్యం పెంచిన సిద్దిపేట బల్దియాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ నుంచి ఆహ్వానం అందుకుంది. అందులో భాగంగా బుధవారం దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన 'స్వచ్ఛ భారత్ దివస్' కార్యక్రమంలో కమిషనర్ ఆశ్రిత్ కుమార్, పారిశుద్ధ్య కార్మికుడు నాంపల్లి పాల్గొన్నారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా విన్నారు. రాష్ట్రం నుంచి నాలుగు మున్సిపాలిటీలకు ఆహ్వానం లభించిందని, అందులో సిద్దిపేట బల్దియాకు చోటు దక్కడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలను చైతన్యం చేయడంతో పాటు వారి సహకారంతో స్వచ్ఛతకు కృషి చేశామని వివరించారు.


కార్యక్రమంలో బల్దియా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

మంత్రి కాన్వాయ్ ఢీకొని ముగ్గురికి గాయాలు

వర్గల్: మంత్రి శ్రీధర్‌బాబు కాన్వాయ్ ఢీకొని ముగ్గురు వ్యక్తులకు గాయాలైన ఘటన బుధవారం రాత్రి వర్గల్ మండలం గౌరారం సమీపంలోని జరిగింది. ఎస్సై కరుణాకర్ రెడ్డి, బాధితులు తెలిపిన వివరాలు.. మర్కూక్ మండలం పాతూరుకి చెందిన మన్నెబోయిన బాలరాజు, అతని కుమారుడు భానుప్రసాద్, అదే గ్రామానికి చెందిన చందా కనకయ్య కలిసి ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతున్నారు. హైదరాబాద్ వెళ్తున్న మంత్రి శ్రీధర్‌బాబు కాన్వాయ్‌లోని ఎస్కార్ట్ వాహనం బైకును బలంగా ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో బాలుడి రెండు కాళ్లు విరగ్గా.. బాలరాజుకు కాలు, చేయి, కనకయ్యకు కాలు విరిగింది. సమాచారం తెలుసుకున్న గౌరారం పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకొని క్షతగాత్రులను మంత్రి ఎస్కార్ట్ వాహనంలోనే గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ కిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


భానుప్రసాద్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబసభ్యులు

నేడు గజ్వేల్‌కు ముగ్గురు మంత్రుల రాక

గజ్వేల్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు నేడు గజ్వేల్‌కు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రానున్నట్లు డీసీసీ అధ్యక్షుడు టి.నర్సారెడ్డి తెలిపారు. గజ్వేల్‌లోని మార్కెట్ యార్డులో నిర్వహించే కార్యక్రమానికి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

3న నందారంలో కుటుంబ ఆరోగ్య సర్వే

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: అక్కన్నపేట మండలం నందారంలో ఈనెల 3వ తేదీ నుంచి కుటుంబ ఆరోగ్య కార్డుల జారీ కోసం సర్వే నిర్వహించనున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద మొదట ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామం, మున్సిపల్ వార్డును ఎంపిక చేసి ఈ సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగా నందారం గ్రామంతో పాటు హుస్నాబాద్ పట్టణంలోని ఒక వార్డు ఎంపికయ్యాయని ఎంపీడీవో బానోతు జయరాం తెలిపారు. ఈ సర్వే కోసం తహసీల్దార్, ఎంపీడీవో, మండల పరిషత్తు సూపరింటిండెంట్ ఆధ్వర్యంలో మూడు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. వీరు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల సమగ్ర వివరాలు, ఫొటో తీసి నమోదు చేస్తారన్నారు. గ్రామస్థులు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు.

సాగు తగ్గి.. ధరలు పెరిగి

● ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో కూరగాయల సాగు తగ్గడంతో ధరలపై ప్రభావం పడుతోంది. గతంలో అధిక విస్తీర్ణంలో సాగు చేసినప్పటికీ. గత మూడేళ్లుగా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఎక్కువగా వరి, పత్తి, మొక్కజొన్న, ఇతరత్రా పంటలను సాగు చేస్తున్నారు. కూరగాయల సాగు తగ్గడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ ప్రభావం ధరలపై పడుతోంది. ప్రస్తుత యాసంగి సీజన్‌లో కూరగాయల సాగు విస్తీర్ణం పెంచితే ప్రజలకు తక్కువ ధరలకు లభించనున్నాయి.

5500 ఎకరాల్లో అవసరం..

జిల్లా జనాభాకు సరిపడా 5500 ఎకరాల్లో కూరగాయలను పండించాల్సిన అవసరం ఉంది. వానాకాలంలో రైతులు సుమారు 4వేల ఎకరాల్లో మాత్రమే కూరగాయలు సాగు చేశారు. దీంతో దిగుబడిపై ప్రభావం చూపుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు చేతికందే సమయంలో దెబ్బతినడంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. జిల్లా జనాభాకు అనుగుణంగా సాగు లేకపోవడంతో ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. సిద్దిపేట జిల్లాకు ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అత్యధికంగా కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. అక్కడ కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతినడంతో కూరగాయలు రావడం లేదు. దీంతో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆగస్టులో కిలో టమాట రూ.20-22 ధర ఉండగా సెప్టెంబరులో రూ.38కి పెరిగింది. అక్టోబరు 1న రూ.54ధర పలుకుతోంది. జూన్‌లో కిలో ఉల్లి రూ.40 ఉండగా ఆగస్టులో 50-55 ధర పలికింది.

జిల్లాలో కూరగాయల సాగు(ఎకరాల్లో)

టమాట	1700
మిర్చి	490
బెండ	350
బీన్స్	560
తీగ జాతి	900


రైతు బజారులో కూరగాయలు విక్రయిస్తున్న అన్నదాతలు

ప్రభుత్వం ప్రోత్సహిస్తే మేలు..

- కూరగాయల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం చాలా అవసరం. రైతులకు రాయితీపై విత్తనాలను అందించాలి.
- హరిత పందిరి, బిందు, తుంపర సేద్య పరికరాలు, మాల్చింగ్ షీట్లు, పందిళ్ల స్తంభాలు, తీగలు, ప్లాస్టిక్ పెట్టెలు రాయితీపై అందించాలి.
- పంటల బీమా కల్పించాలి.
- కోతులు, అడవి జంతువులను నివారించాలి.

చర్యలు తీసుకుంటున్నాం

– సువర్ణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి

జిల్లాలో అన్నదాతలు కూరగాయలు సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుత సీజన్‌లో 40 ఎకరాల్లో టమాట, వంకాయ, మిరప నారును రాయితీపై అందించాం. తీగజాతి కూరగాయ సాగుకు పందిళ్లను రాయితీపై ఇస్తున్నాం. ఆయిల్ పామ్ తోటల్లో కూరగాయలు సాగు చేసేలా అవగాహన కల్పిస్తున్నాం.

150 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

బెజ్జంకి, న్యూస్‌టుడే: గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి.. ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకువెళ్తున్న వాహనాలను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం గ్రామానికి చెందిన పలువురు కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశారు. వీటిని అక్రమంగా నిల్వ చేస్తూ ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. తోటపల్లి శివారులోని ఓ కోళ్లఫారం వద్ద మిని గూడ్స్ వాహనాల నుంచి డీసీఎం వ్యాన్‌లోకి బియ్యం బస్తాలు ఎక్కిస్తుండగా సిద్దిపేట ఏసీపీ మధు, ఎస్సై క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు జరిపారు. సుమారు 150 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని ఎనిమిది మిని గూడ్స్ వాహనాలు, డీసీఎం వ్యాన్‌ను ఠాణాకు తరలించారు. బొమ్మలరామారం గ్రామానికి చెందిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు.


ఠాణా ఆవరణలో బియ్యం సంచుల వాహనాలు

9 ద్విచక్రవాహనాలు దొంగిలించిన దంపతులు

రామచంద్రాపురం రూరల్: ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసి జల్సాలకు అలవాటు పడిన భార్యాభర్తలతో పాటు మరొకరిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మోకిల ఠాణా పరిధి ఇంద్రారెడ్డి నగర్‌కు చెందిన భానుప్రసాద్ ఆయన భార్య కీర్తనతో కలిసి ఇటీవల దొంగతనం చేసిన బైకుపై వెళ్తుండగా గుర్తించి పట్టుకున్నారు. విచారణలో వారితో పాటు స్నేహితుడు సేలం సాయిలు.. కొల్లూరు, బోయగూడ, భువనగిరి, విద్యానగర్, ఖాజీపేట, జనగాం, కుషాయిగూడ ప్రాంతాల్లో 14 ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వాటిని సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కరుణాకర్‌కు విక్రయించినట్లు తెలిపారు. పోలీసులు 9 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. భానుప్రసాద్, కీర్తన, కరుణాకర్‌లపై కేసు నమోదు చేసి ముగ్గురిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. సాయిలు పరారీలో ఉన్నాడు.

దరఖాస్తుల ఆహ్వానం

వర్గల్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డి.రాజేందర్ పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో వర్గల్ నవోదయలో ఖాళీగా ఉన్న సీట్లలో చేరేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిదో తరగతిలో చేరేందుకు ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు, 11లో చేరేందుకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ shttps://www.navodaya.gov.inలో ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025, ఫిబ్రవరి 8న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఏడుగురు గంజాయి విక్రేతల అరెస్టు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: గంజాయి దమ్ము పీల్చుతూ జల్సాలకు అలవాటై దానిని ఇతరులకు అమ్ముతున్న యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని కేసీఆర్‌నగర్‌కు చెందిన శశివర్ధన్, షాదుల్, నివాస్, వారి స్నేహితులతో కలిసి ఓ వ్యక్తి వద్ద గంజాయి కొంటున్నారు. గంజాయిని బుధవారం సిద్దిపేటలోని కేసీఆర్‌నగర్‌లో విక్రయించే క్రమంలో పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ క్రమంలో శశివర్ధన్‌ను అదుపులోకి తీసుకున్నారు. షాదుల్, నివాస్ పరారయ్యారు. స్నేహితులు సురేశ్, రఘువంశీ, దయాకర్, లక్ష్మణ్, చాంద్‌పాషా, రోహిత్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 1040 గ్రాముల ఎండు గంజాయి, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు.

దేవీ శరణం గచ్ఛామి

నేటి నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం

ఆధ్యాత్మిక శక్తి.. ప్రపంచాన్ని ముందడుగు వేసేలా చేస్తోంది. శక్తికి మారుపేరు అమ్మవారు. అమ్మవారిని ఏకాగ్రచిత్తంతో ఆరాధిస్తే ధైర్యం ఆవహిస్తుంది. మంచి పనులకు మనసును పురిగొల్పుతుంది. నేటి నుంచి దశమి వరకు శరన్నవరాత్రోత్సవాల్లో దుర్గామాత, సరస్వతి మాత క్షేత్రాల్లో రోజుకో రకంగా దివ్యమైన పూజలు జరుగుతాయి. భక్తులు దీక్ష తీసుకొని మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి అర్చిస్తారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలోని ముఖ్య ఆలయాలు, మండపాలు వాటి ప్రత్యేకతలపై కథనం.


చిట్కుల్‌లో చాముండేశ్వరి

శాంతస్వరూపిణి

చిలప్‌చెడ్: మంజీరా నదీ తీరంలో చాముండేశ్వరి దేవి గుడి విలసిల్లుతోంది. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామంలో శాంతిస్వరూపిణిగా చాముండి దర్శనం ఇవ్వడం విశేషం. నేడు మొదటి రోజున వేయి కడవల నది నీటితో అభిషేకిస్తారు. నిత్యం పారాయణాలు నిర్వహిస్తారు.

మహిళలే ముందుకు..

తూప్రాన్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో కులాలతో సంబంధం లేకుండా సమష్టిగా ఉత్సవాల నిర్వహణ ఇక్కడి ప్రత్యేకత. నిమజ్జనం రోజు ప్రధాన మహిళలే భాగస్వామ్యమై కోలాటంతో శోభాయాత్ర చేపడతారు. మహంకాళి దేవాలయ ఆవరణలో 26 సంవత్సరాలుగా నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. 90 మంది భక్తులు దీక్షలో ఉంటారు.


మహంకాళి మందిరం

గడికోట వైభవం

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటలోని చారిత్రక శంకరమ్మ గడికోటను కొన్నేళ్ల క్రితం గ్రామస్థులు మరమ్మతులు చేసి వాడుకలోకి తెచ్చుకున్నారు. అందులోభాగంగా గడికోట ఉత్సవ సమితిగా ఏర్పడి నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. కోటలో అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. బోనాలు, ప్రస్తుత ఉత్సవాలతో ఈ కోట శిథిలం కాకుండా చారిత్రక సాక్ష్యంగా నిలిచింది.

తుంకిమెట్లలో పొయ్యి వెలగదు!

కొడంగల్, బొంరాస్‌పేట: వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల గ్రామంలో రోజూ సామూహిక భోజనం ఉంటుంది. ఎవరింట్లోనూ వంటలు చేయరు. పదేళ్లుగా దుర్గామాత పూజల్లో ఆనవాయితీ ఇది. గ్రామంలో 1200 మంది జనాభా. నిమజ్జనం రోజు 300 మంది ఏకరూప దుస్తులతో విగ్రహాన్ని తరలిస్తారు.


పెద్దశంకరంపేటలోని గడికోట

అర్ధనారీశ్వరం విశేషం

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణం: సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని సంతోషిమాత దేవాలయంలో నాలుగో రోజున అర్ధనారీశ్వరి అలంకరణ ఉమ్మడి జిల్లాలోనే పేరుగాంచింది. నేటి నుంచి వరుసగా బాలాత్రిపురసుందరి, మహాలక్ష్మి, రాజరాజేశ్వరి, అర్ధనారీశ్వరి, లలితాంబిక, అన్నపూర్ణ, సరస్వతి, దుర్గ, మహిషాసురమర్దిని, సంతోషిమాత అవతారాల్లో దర్శనం లభిస్తుంది.


గజ్వేల్ సంతోషిమాత

ఏడుపాయల్లో ఆధ్యాత్మిక పరవళ్లు

పాపన్నపేట, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. సమీపంలోని గోకుల్ షెడ్‌లో అర్చనలు కొనసాగుతాయి. ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు నేడు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అమ్మవారిని రోజూ వివిధ అవతారాల్లో భక్తులు దర్శించుకుంటారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. దసరా రోజు 15 వేల మందికి పైగా దర్శించుకుంటారు. ఏటా సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల ఉంటుంది. ఈ సమయంలో రాజగోపురంలోనే పూజలు జరుగుతున్నాయి. వనదుర్గ ప్రాజెక్టు నుంచి 8000 క్యూసెక్కుల వరద దిగువకు బుధవారం ప్రవహిస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ విజయ్ కుమార్ తెలిపారు. గురువారం ప్రవాహం మరింత పెరగనుందని ఆయన తెలియజేశారు.


వనదుర్గమ్మ

కమనీయ రూపాలు

▼ మొదటి రోజు శైలపుత్రి ▼ రెండో .. బ్రహ్మచారిణి ▼ మూడో .. చంద్రఘంట ▼ నాలుగో .. కూష్మాండ ▼ ఐదో .. స్కంధమాత ▼ ఆరో .. కాత్యాయని ▼ ఏడో .. కాళరాత్రి ▼ ఎనిమిదో .. మహాగౌరి ▼ తొమ్మిదో .. సిద్ధిధాత్రి ▼ పదో .. రాజరాజేశ్వరి

గతేడాది వాహన పూజలు

ద్విచక్ర .. 100
నాలుగు చక్రాలవి 50
భారీవి .. 20

గతేడాది ప్రసాదాల విక్రయం

లడ్డూలు - 3000 పులిహోర - 2000

ప్రత్యేక పూజలు

- రోజూ ఉదయం 9:30 గంటలకు అర్చనలు ప్రారంభం
- 6వ రోజున మూల నక్షత్రం సందర్భంగా మంగళవారం బోనాలు సమర్పిస్తారు.
- 9వ రోజున మహర్నవమి నేపథ్యంలో సువాసిని పూజ, చండీ హోమం నిర్వహిస్తారు.
- నిత్యం అన్నదానం చేపడతారు.

సరస్వతి నమస్తుభ్యం

వర్గల్, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా వర్గల్ సరస్వతి క్షేత్రంలో సరస్వతి నమస్తుభ్యం మంత్రోచ్ఛారణ మార్మోగనుంది. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గురువారం కలశ స్థాపన జరుగుతుంది. 9న మూల నక్షత్రం సందర్భంగా పుష్పగిరి, రంగంపేట, శ్రీక్షేత్రం పీఠాధిపతులు అమ్మవారికి పూజలు నిర్వహించి అనుగ్రహ భాషణం చేయనున్నారు.


వర్గల్ విద్యాధరి

ఆలోచనకు పెద్దపీట



'ఉపాయం వచ్చినోడు.. ఉపాసం ఉండడు' ఈ సామెతను చిన్నారులు నిజం చేశారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం ఐనాపూర్‌లో బరువైన పెద్దపీటను కొందరు చిన్నారులు ఓవైపు మోస్తూ మరోవైపు భాగాన్ని సైకిల్‌పై పెట్టి తరలిస్తున్నారు. గణపతి వేడుకలు ముగిసి అమ్మవారి శరన్నవరాత్రోత్సవాల కోసం మండపాలు ఏర్పాటు చేశారు. అవసరానికి పీటను ఒకచోట నుంచి మరోచోటకు చేర్చడానికి చిన్నారులు ఇలా ఆలోచన చేశారు. స్థానికులు చూసి 'భళా పిల్లలు.. భలే చేశారు' అని మెచ్చుకున్నారు. - న్యూస్‌టుడే, చేర్యాల

లారీని ఢీకొన్న స్కార్పియో.. ఒకరి దుర్మరణం

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుక నుంచి స్కార్పియో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని మాడిగి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... ముంబయి వైపు వెళ్తున్న స్కార్పియో వాహనం మొగుడంపల్లి మండలం మాడిగి సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టింది. స్కార్పియోలో వెనుక కూర్చున్న హైదరాబాద్ టోలిచౌకికి చెందిన ఆబెద్ కుర్షిద్(50) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాద ఘటనపై ఫిర్యాదు అందలేదని చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

సంపులో పడి బాలుడి మృతి


రుద్రాన్ష్


చిన్నకోడూరు, న్యూస్‌టుడే: ఒక్కగానొక్క కొడుకు ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి కళ్లెదుటే మృత్యుఒడికి చేరడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషాదకర ఘటన చిన్నకోడూరు మండలంలోని మైలారం మధిర గ్రామం కమ్మర్లపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. కమ్మర్లపల్లికి చెందిన బైకని వేణు, రేణుక దంపతులకు ముగ్గురు కుమార్తెలు, మూడున్నరేళ్ల కుమారుడు రుద్రాన్ష్ ఉన్నారు. వారం రోజుల క్రితం వేణు తన ఇంటి ఆవరణలో సంపు నిర్మించి నీటితో నింపాడు. దాని పై కప్పు వేయలేదు. రుద్రాన్ష్ బుధవారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు సంపులో పడిపోయాడు. సుమారు గంట తర్వాత బాలుడు కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు వెతకగా సంపులో పడి ఉన్నాడు. స్థానికుల సాయంతో బాలుడిని బయటకు తీసి చూసే సరికి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే ఓ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


నర్సింహులు

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మెదక్ పట్టణం అవుసులపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఏఎస్ఐ శివకుమార్ తెలిపిన ప్రకారం పట్టణానికి చెందిన బొయిని నర్సింహులు (55) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ సభ్యులను పోషిస్తున్నాడు. బుధవారం పొలం గట్టుపై నడుస్తుండగా, కాలు జారడంతో పక్కనే ఉన్న విద్యుత్ నియంత్రిక సపోర్ట్ తీగను పట్టుకున్నాడు. అదే సమయంలో కరెంట్ సరఫరా అవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. నర్సింహులుకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు...


మోహన్

టేక్మాల్, న్యూస్‌టుడే: వ్యవసాయ క్షేత్రం పక్కన ఉన్న గుంతలో పడి ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లాస్‌పూర్ శివారులో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్సై దయానంద్ తెలిపిన వివరాలు.. టేక్మాల్‌కు చెందిన బాజ మోహన్(29) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతంలో వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం పొలాల పక్కన గుంతలో పడి మృతి చెందిన విషయం స్థానికుల ద్వారా కుటుంబ సభ్యులకు తెలిసింది. రోడ్డు పక్కన మోహన్ ద్విచక్ర వాహనం నిలిపి ఉంది. వాహనంపై రక్తపు మరకలు ఉన్నాయి. కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య సునీత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	110-00	డ్రెస్డ్	191-00
రిటైల్	132-00	స్కిన్‌లెస్	218-00

స్టార్టప్‌తో ముందంజ

దుబ్బాక, సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రపంచంలో శాస్త్ర సాంకేతికత రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నేడు చదువుకున్న యువత కొత్తగా ఆలోచిస్తున్నారు. ఉద్యోగాల వేట కంటే ఈతరానికి అనుగుణమైన వ్యాపారాలు చేపడుతున్నారు. ఆన్‌లైన్ షాపింగ్‌ల పేరుతో సరికొత్త స్టార్టప్ కంపెనీలు ప్రారంభిస్తూ సఫలమవుతున్నారు. అలాంటి కోవలోకి చెందిన వారు.. సిద్దిపేట జిల్లాకు చెందిన ఇద్దరు సోదరులు. దుబ్బాక పట్టణానికి చెందిన కిష్టమ్మగారి సందీప్‌రెడ్డి, సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లికి చెందిన నిమ్మ నిఖిల్‌రెడ్డి వరుసకు సోదరులు. వీరు రైతు కుటుంబాలకు చెందిన వారు. సందీప్‌రెడ్డి.. బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ చేశారు. నిఖిల్‌రెడ్డి ఎమ్మెస్సీ బోటనీ చదివారు. విద్యాభ్యాసం పూర్తయ్యాక వీరు భిన్నంగా ఆలోచించి, ఈ-కామర్స్ రంగంలో పోటీ పడాలనే ఆలోచన చేశారు. మూడు నెలల క్రితం హైదరాబాద్‌లోని సుచిత్ర కేంద్రంగా 'బూకార్ట్ ట్రేడింగ్ స్టోర్స్' (ఓపీసీ) ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ప్రారంభించారు. దాదాపు రూ. 12 లక్షల బ్యాంకు రుణంతో ప్రారంభించారు. వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ వేదిక ఏర్పాటు చేసి, షాపింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఫ్యాషన్ రంగానికి సంబంధించి దుస్తులు, చెప్పులు ఆర్డర్స్ ద్వారా చేయించి ఆన్‌లైన్‌లో పెడుతున్నారు. విక్రయించేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు 1500 ఆర్డర్లు వచ్చాయన్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని వస్తువులను ఆన్‌లైన్ షాపింగ్‌లో అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని వారు చెప్పారు. కొద్ది రోజుల్లో కంపెనీ యాప్‌ను అందుబాటులోకి తేనున్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వస్తువులను 3, 4 రోజుల్లో వివిధ కొరియర్ కంపెనీల ద్వారా వినియోగదారుల ఇంటికి పంపిస్తున్నారు. వస్తువులకు చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌లో డెబిట్, క్రెడిట్, యూపీఐ ద్వారా చెల్లుబాటు అయ్యేట్లు అనుమతులు తీసుకున్నామని చెప్పారు. నాణ్యమైన వస్తువులను అందించే లక్ష్యంతో స్టార్టప్ కంపెనీ ప్రారంభించామని తెలిపారు. సొంత కాళ్లపై నిలబడి, తాము ఎదుగుతూ తమతోపాటు మరికొందరు యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో దీనిని ప్రారంభించామని.. విస్తరిస్తామని చెప్పారు. స్టార్టప్ కంపెనీలు ప్రారంభించాలనే ఆలోచన ఉన్నవారికి ఉచితంగా సూచనలు, సహకారం అందిస్తామంటున్నారు.


సందీప్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి



అతివల ఏకరూపం.. బతుకమ్మల సంబురం

తీరొక్క పూలు తెచ్చి ఆకర్షణీయంగా బతుకమ్మలను మహిళలు పేర్చారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆడిపాడారు. సిద్దిపేట జిల్లా నంగునూరులోని బస్టాండు కాలనీ మహిళలు తాము ప్రత్యేకంగా నిలవాలనే ఉద్దేశంతో ఏకరూప చీరలు ధరించి బతుకమ్మ ఆడారు. - న్యూస్‌టుడే, నంగునూరు

భాస్కరయోగికి సాహిత్య పురస్కారం



పరిగి, న్యూస్‌టుడే: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఏటా అందించే పురస్కారానికి ఆధ్యాత్మిక వేత్త, రచయిత, సామాజిక విశ్లేషకుడు పి.భాస్కరయోగి ఎంపికయ్యారు. వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన ఆయనకు ఈనెల 4న హైదరాబాద్‌లోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పాకాల యశోదారెడ్డి ధర్మనిధి పురస్కారం ప్రదానం చేయనున్నారు. తెలంగాణ సాహిత్య చరిత్రలో చోటు దక్కని 300 మంది వాగ్గేయకారుల కీర్తనలను, జీవితాలను ఆయన పరిశీలించి సాహిత్య లోకానికి ఆయన పరిచయం చేశారు. తెలంగాణ పద సంకీర్తనల పేరుతో సాహిత్య అకాడమీ ఆ పుస్తకాన్ని ప్రచురించింది. సాహిత్య సౌరభాలు పేరుతో ఆయన పరిశోధనాత్మక గ్రంథం వెలువడింది.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం


నరేష్

నిజాంపేట, రామాయంపేట, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నిజాంపేటలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దండు నరేష్(42) గతంలో దుబాయ్‌కి వెళ్లాడు. ఇటీవల ఇంటికి తిరిగివచ్చాడు. అప్పులు తీర్చలేక, స్థానికంగా పని దొరక్క మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 1న పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ పొందుతూ బుధవారం మృతి చెందాడు. నరేష్ భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నర్సు ఆత్మహత్య: శివ్వంపేట, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దంతాన్‌పల్లిలో యువతి ఆత్మహత్య చేసుకుంది. శివ్వంపేట ఎస్ఐ మహిపాల్ రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన కుల్ల అంజలి(21) మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా చేస్తోంది. ఆమెకు తల్లి, సోదరుడు, ఇద్దరు అక్కలు ఉన్నారు. తండ్రి గతంలోనే మృతి చెందాడు. తల్లి కూలీ పనులు చేస్తుంటారు. నలుగురు సంతానంలో అంజలి అందరికంటే చిన్న. మంగళవారం దంతాన్‌పల్లిలో బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి సత్తమ్మ వెళ్లి చూడగా ఇంటి ముందున్న చెట్టుకు చున్నీతో ఉరి వేసుకొని కనిపించింది. యువతి మృతికి కారణాలు దర్యాప్తులో తెలుస్తాయని ఎస్ఐ చెప్పారు. ఆమె సోదరుడు ఆనంద్ ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.


అంజలి

మంత్రాల నెపంతో కుటుంబ సభ్యులపై దాడి


రామాయంపేట, న్యూస్‌టుడే: మంత్రాల నెపంతో మహిళతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఘటన రామాయంపేట మండల పరిధి ప్రగతి ధర్మారంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గుర్రం విజయ భర్త సిద్ధిరాములు అదే గ్రామానికి చెందిన పున్న చంద్రం ఇంటి వద్ద చెట్టు కింద నిమ్మకాయలు, పసుపు, కుంకుమ పెట్టి మంత్రాలు చేస్తున్నారని ఆగ్రహించి బుధవారం పది మంది విజయపై దాడి చేశారు. అడ్డు వచ్చిన భర్త సిద్ధిరాములు, వారి కుమారుడినీ కొట్టారు. అనంతరం వారిని చెట్టుకు కట్టేశారు. స్థానికులిచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకొని వారిని కాపాడారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

యోగా శిక్షణ.. ఆరోగ్య రక్షణ

న్యూస్‌టుడే, నర్సాపూర్: సంపూర్ణ ఆరోగ్యం.. మానసిక ప్రశాంతత.. యోగాతోనే సాధ్యం. సరైన సూచనలు, సలహాలు పాటిస్తూ సాధన చేస్తే ఒత్తిడిని జయించవచ్చని అంటున్నారు యోగా సాధకులు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నిత్య జీవన యోగాసాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ భవనం కేంద్రంగా చేసుకుని ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకూ సాధన చేస్తున్నారు. సుమారు 40 మంది క్రమం తప్పకుండా యోగాసానాలు వేస్తున్నారు. ఇటీవల నర్సాపూర్ అర్బన్ పార్కులోని వాచ్ టవర్ వద్ద యోగా శిబిరం చేపట్టారు. రాయరావు చెరువు కట్టపైనా ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ యోగా చేస్తున్నారు. వారంతా సాత్వికాహారం స్వీకరిస్తున్నారు. పట్టణంలో శాకాహార ర్యాలీలు చేపడుతూ అవగాహన కల్పిస్తున్నారు.

కేంద్రం ఏర్పాటుకు యత్నం

సమితి ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో యోగా కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఎకరం విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నారు. ఇందుకు ప్రభుత్వ సహకారం తీసుకోవాలని యోచిస్తున్నారు. రాయరావు చెరువు కేంద్రంగా దీని ఏర్పాటుకు ప్రతిపాదనలు అధికారులకు అందించారు. అటవీ ప్రాంతానికి సమీపంలో నీటి వనరు వద్ద, చల్లని గాలులు, ప్రకృతి సహజ సిద్ధమైన వాతావరణంల నెలకొల్పే ఉద్దేశంతో కేంద్రం కోసం ప్రయత్నిస్తున్నారు.


నర్సాపూర్ చెరువు కట్టపై శిబిరం

గురువుగా విశ్రాంత ఉద్యోగి

శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన యోగా గురువు సురేందర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో విశ్రాంత ఉద్యోగి. రెండు దశాబ్దాల నుంచి ఆసక్తిని పెంచుకున్నారు. వివిధ యోగా సంస్థల్లో ప్రత్యేక శిక్షణ పొందారు. ఉద్యోగ విరమణ అనంతరం యోగా గురువుగా ఆయన తన ప్రస్థానం ప్రారంభించారు. సుమారు 500 పైగా శిక్షణలు చేపట్టారు. సుమారు రెండు వేల మందికి పైగా ఆయన వద్ద శిక్షణ పొందారు. 15 మంది శిక్షకులయ్యారు. వారు స్వతహాగా యోగా శిక్షణా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. పాఠశాలలు, ప్రైవేటు సంస్థలలో ఉచితంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం నర్సాపూర్‌లో శిక్షణ కేంద్రం నిర్వహిస్తూ, విజన్ వృద్ధాశ్రమం, మద్యానికి బానిసలైన వారి పునరావాస కేంద్రంలో యోగా తరగతులు చేపడుతున్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో సారథి పేరుతో ప్రభుత్వ కేంద్రం ఏర్పాటుకు కృషి చేశారు. కపాలబాతి, ప్రాణాయామం వంటి ఆసనాలు వేయించడంలో ప్రత్యేకత చూపుతున్నారు. యోగా సాధనపై ముందుగా అవగాహన కల్పించి ప్రారంభింపచేస్తారు. గురువు సురేందర్ మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ప్రతి ఒక్కరికీ యోగా భాగం కావాలని ఆకాంక్షించారు. ఆరోగ్య రక్షణకు ఇది దోహదపడుతుందన్నారు.

పూలవనం.. ఆనందమయం



వికారాబాద్ మండలంలోని తట్టేపల్లి వెళ్లే మార్గంలో ఓ రైతు పొలంలో కాశ పూలు, బంతి పూల తోట విశేషంగా చూపరులను ఆకట్టుకుంటోంది. వివిధ రంగులతో అలరిస్తూ బతుకమ్మల రూపకల్పనలో మారేందుకు సిద్ధమయ్యాయి. పరిసరాలను ఆహ్లాదకరంగా మార్చాయి. - న్యూస్‌టుడే, పెద్దేముల్

ఖైదీల్లో మార్పునకు జైళ్ల శాఖ కృషి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఖైదీల్లో మార్పునకు జైళ్లశాఖ అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆ శాఖ డీఐజీ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా కందిలోని కేంద్ర కారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖైదీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జైళ్ల శాఖ పెట్రోల్ బంకులు, పరిశ్రమలు నిర్వహిస్తోందని, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్, జైళ్ల శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఖైదీకి బహుమతి అందజేస్తున్న జైళ్ల శాఖ డీఐజీ శ్రీనివాస్

స్కేటింగ్‌లో ఇషాన్ ప్రతిభ



సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో సిద్దిపేట శ్రీసాయి స్కేటింగ్ అకాడమీకి చెందిన చిన్నారి కంచర్ల ఇషాన్ సత్తా చాటాడు. అండర్-7 విభాగంలో 500 మీటర్ల క్వాడ్ స్కేటింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈనెల 4వ తేదీ నుంచి భువనగిరిలో నిర్వహించే తెలంగాణ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడని శిక్షకుడు సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు యువజన క్రీడల శాఖ జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్‌గౌడ్, సిద్దిపేట స్పోర్ట్స్ కన్వీనర్ పాల సాయిరాం, జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పిండి అరవింద్, ఉపాధ్యక్షుడు పల్లె చంద్రశేఖర్‌గౌడ్, కార్యదర్శి సంతోష్ ఇషాన్‌ను అభినందించారు.

'హ్యాండ్‌బాల్'కు విద్యార్థుల ఎంపిక

హుస్నాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హుస్నాబాద్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. 3 నుంచి 5 తేది వరకు నారాయణపేట జిల్లా కోస్గిలో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్ల తరఫున ఆడనున్నారు. పాఠశాలలో పదోతరగతి చదువుతున్న ఎం.శివబాలాజీ బాలుర విభాగంలో, కె.ప్రశాంత బాలికల విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పీడీ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరెడ్డి, పురాధ్యక్షురాలు రజిత, ఎంఈవో మనీలా అభినందించారు.


విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరెడ్డి

రాష్ట్రస్థాయి పోటీలకు ఆకునూరు బాలలు

చేర్యాల, న్యూస్‌టుడే: ఇటీవల సిద్దిపేటలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీల్లో చేర్యాల మండలం ఆకునూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆకునూరులో చిన్నారులు ఎం.సాత్విక, సీహెచ్. భార్గవి, వి.శిరీష, టి.దివ్యశ్రీని అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ప్రధానోపాధ్యాయుడు ఐలయ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.కవిత ఆకాంక్షించారు.


విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయురాలు

7న బహుజన బతుకమ్మ వేడుకలు


గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఐకాస నాయకులు

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించే బహుజన బతుకమ్మ వేడుకలను జయప్రదం చేయాలని ఐకాస నాయకులు కోరారు. బుధవారం అక్కన్నపేటలో వేడుకలకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. సాయంత్రం 7 గంటలకు జరిగే వేడుకలకు పెద్దఎత్తున మహిళలు తరలి రావాలని కోరారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

రాయపోల్, న్యూస్‌టుడే: మండల పరిధి రాయపోల్, గుర్రాలసోఫా, రాంసాగర్ తదితర విద్యుత్తు ఉపకేంద్రాల్లో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్తు సరఫరా ఉండదని తుక్కాపూర్ ఏడీఏ శ్రీనివాసరావు తెలిపారు. వడ్డేపల్లి, రామారం, రాంసాగర్, వీరానగర్, అనాజీపూర్, లింగారెడ్డిపల్లి, మంతూర్, కొత్తపల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందన్నారు.

దౌల్తాబాద్: మండల పరిధి ముబారక్‌పూర్ విద్యుత్తు కేంద్రంలో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ వాసుదేవరావు తెలిపారు. దౌల్తాబాద్‌తో పాటు మాచిన్‌పల్లి, గొడుగుపల్లి, మహ్మద్‌షాపూర్, దీపాయంపల్లి, ముబారక్‌పూర్, ఇండస్ట్రియాల్ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదు.

యథేచ్ఛగా మట్టి దందా

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే కొందరు యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. హిటాచీలు, జేసీబీలు పెట్టి టిప్పర్లు, ట్రాక్టర్లలో మట్టి తరలిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. గ్రామాల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నవారిని క్షేత్ర స్థాయిలోనే అడ్డుకోవాల్సిన రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్థానిక అవసరాలే లక్ష్యంగా..

రాజీవ్ రహదారికి ఇరువైపులా నూతన వెంచర్లు, గృహ నిర్మాణాలు పెద్ద మొత్తంలో చేపడుతుండడంతో స్థానికంగా మట్టికి డిమాండ్ ఏర్పడింది. దీంతో నిత్యం మట్టి తవ్వకాలు చేపట్టి సమీపంలోని వెంచర్లు, నిర్మాణరంగ భవనాలకు తరలిస్తూ అక్రమార్కులు ఆదాయం గడిస్తున్నారు. ఎక్కువగా

అనుమతులు లేకుండానే తవ్వకాలు

కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, ఖమ్మంపల్లి, కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం, ముద్దాపూర్ శివారుల్లోని కాలువ మట్టిని ఇష్టారీతిన తరలిస్తున్నారు. స్థానిక అవసరాలకే తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఈ దందా మరింత ఎక్కువగా సాగుతోంది.

జరిమానాలు విధిస్తున్నా..

సాధారణంగా ఏదైనా ప్రాంతంలో మట్టి తవ్వకాలు చేపట్టాలంటే భూగర్భగనుల శాఖ, రెవెన్యూ శాఖల అనుమతులు తప్పనిసరి తీసుకొని నిర్దేశిత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడ మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టి తవ్వకాలు సాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. గడిచిన నెలరోజుల వ్యవధిలోనే కొండపాక మండలంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను రెవెన్యూ అధికారులు రెండుసార్లు


ఖమ్మంపల్లి శివారులో టిప్పర్లలో మట్టి నింపుతున్న జేసీబీలు

పట్టుకొని జరిమానాలు విధించడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలు సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

అక్రమ మట్టి తవ్వకాలు చేపట్టే వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం. మొదటిసారి పట్టుబడితే వాహనాలపై జరిమానాలు విధించి విడుదల చేస్తున్నాం. అనుమతి లేనిదే మట్టి తవ్వకాలు చేపట్టొద్దని హెచ్చరిస్తున్నాం. నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేసి, వారిపై కేసులు నమోదు చేస్తాం.
– దిలీప్‌నాయక్, తహసీల్దారు, కొండపాక

విద్యుద్దీపాలు లేక మహిళల ఇబ్బందులు


కోమటిచెరువు వద్ద చరవాణుల వెలుతురులో వెళుతున్న మహిళలు, చిన్నారులు తదితరులు

సిద్దిపేట టౌన్: బతుకమ్మ పండుగ సందర్భంగా కోమటిచెరువు వద్ద బల్దియా అధికారులు విద్యుద్దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు. కోమటిచెరువుకు అవతలి వైపు వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రాంతంలో విద్యుద్దీపాలు లేకపోవడంతో చరవాణుల వెలుతురులో బతుకమ్మ ఆడి, అదే చీకటిలో చెరువులో నిమజ్జనం చేశారు. చీకట్లో మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, అటువైపు కూడా విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం


రోడ్లను శుభ్రం చేస్తున్న బల్దియా అధ్యక్షురాలు మంజుల, ఉపాధ్యక్షుడు కనకరాజు, కౌన్సిలర్లు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం బుధవారం ముగిసింది. సెప్టెంబరు 17న ప్రారంభమైన ఈ కార్యక్రమం గాంధీ జయంతి రోజున ముగిసింది. ఈ సందర్భంగా పట్టణంలో బల్దియా అధ్యక్షురాలు కడవేర్గు మంజుల, ఉపాధ్యక్షుడు కనకరాజు, కౌన్సిలర్లు రోడ్లను శుభ్రం చేశారు. పారిశుద్ధ్య పర్యవేక్షకులు మాధవి, వనిత, సతీష్ పర్యవేక్షణలో కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం పూర్తి చేసిన బల్దియా అధికారులు, సిబ్బందిని బల్దియా అధ్యక్షురాలు మంజుల అభినందించారు.

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేటలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం ముగింపు సందర్భంగా రోడ్లు ఊడ్చారు. పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సన్మానించారు. ఎంపీడీవోలు బానోతు జయరాం, వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంఈవో గుగులోతు రంగా, ఎస్ఐ విజయభాస్కర్, ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోహెడ గ్రామీణం: కోహెడ మండలంలోని తంగళ్లపల్లిలో గాంధీ విగ్రహంపై దుమ్ము, ధూళి పడి నలుపు రంగులోకి చేరింది. ఇది గమనించిన మాజీ సర్పంచి భర్త పాము శ్రీకాంత్ నీటితో శుభ్రం చేశారు. అనంతరం గ్రామస్థులతో కలిసి జాతిపిత జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు.

కనుల నిండుగా.. పూల పండుగ


జగదేవపూర్: మునిగడపలో బతుకమ్మ ఆడుతూ..


గజ్వేల్ గ్రామీణం: అరెపల్లిలో..

న్యూస్‌టుడే బృందం: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు నిదర్శనమైన బతుకమ్మ వేడుకలు జిల్లా వ్యాప్తంగా బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మలను మహిళలు తీరొక్క పూలతో అందంగా పేర్చి అలంకరించారు. నూతన వస్త్రాలు ధరించి ఆయా గ్రామాలు, పట్టణాల్లోని కూడళ్ల వద్ద బతుకమ్మలను పెట్టి లయబద్ధంగా ఆడుతూ పాటలు పాడారు. అనంతరం స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.


తొగుట: తుక్కాపూర్‌లో..


హుస్నాబాద్ గ్రామీణం: పందిల్లలో..

గాంధీజీ ఆశయాలు అనుసరణీయం


సిద్దిపేట టౌన్: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ నేతలు


సిద్దిపేట టౌన్: పోలీసు కమిషనరేట్‌లో అదనపు డీసీపీ మల్లారెడ్డి, పోలీసు అధికారులు

న్యూస్‌టుడే బృందం: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలు, పట్టణాల్లో అధికారులు, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువకులు, మహిళలు, చిన్నారులు గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ పాత్రను కొనియాడారు. నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. పలు చోట్ల పారిశుద్ధ్య కార్మికులకు వస్తువులను అందజేశారు.


సిద్దిపేట టౌన్: సర్వజన ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఐఎంఏ ప్రతినిధులు


దుబ్బాకలో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు

'పేదల పెన్నిధి రామలింగారెడ్డి'


రామలింగారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న పురాధ్యక్షురాలు వనిత, భారాస నాయకులు

దుబ్బాక, న్యూస్‌టుడే: దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, బడుగు, బలహీనవర్గాల పెన్నిధి దివంగత మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అని పురాధ్యక్షురాలు గన్నె వనిత అన్నారు. బుధవారం రామలింగారెడ్డి జయంతి సందర్భంగా దుబ్బాక పట్టణంలోని రెండు పడక గదుల గృహ సముదాయంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. భారాస నాయకులు ఆస స్వామి, పర్స కృష్ణ, ఎల్లారెడ్డి, ర్యాకం శ్రీరాములు, గన్నె భూంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేయిస్తామనడం సరికాదు: భారాస

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: అత్యధిక ప్రజాదరణ పొందిన నాయకులు హరీశ్‌రావు, కేటీఆర్‌లపై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దాడిచేయిస్తానంటూ బహిరంగంగా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పాల సాయిరాం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన మాట్లాడిన మాటలు ప్రజాస్వామ్య వ్యవస్థను పూర్తిగా దిగజార్చే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన బల్దియా మాజీ ఛైర్మన్ కడవేర్గు రాజనర్సుతో కలిసి మాట్లాడారు. మైనంపల్లి కేవలం సీఎం దృష్టిని ఆకర్షించడానికే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. సిద్దిపేటలో గుండాయిజం ప్రదర్శిస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. నాయకులు అరవింద్‌రెడ్డి, భూపేశ్, సుందర్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు: కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, భారాస నాయకులపై మైనంపల్లి విమర్శలు మానుకోవాలని భారాస మండలశాఖ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య చిన్నకోడూరులో బుధవారం అన్నారు.

'భారాస నాయకుల వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'

దుబ్బాక, న్యూస్‌టుడే: మహిళా మంత్రి కొండా సురేఖపై భారాస నాయకులు సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న దుష్ప్రచారాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.5 లక్షల కోట్లతో చేపట్టనున్న మూసీ సుందరీకరణలో అవినీతి చేస్తుందని మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొంగరి రవి, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ కాల్వ నరేశ్, నాయకులు గడీల జనార్దన్‌రెడ్డి, అనంతుల శ్రీనివాస్, పాతూరి వెంకటస్వామి, శ్రీనివాస్, రాజిరెడ్డి, చంద్రారెడ్డి, ఆలేటి సరోజన తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖ తక్షణమే క్షమాపణ చెప్పాలి: వొడితల

హుస్నాబాద్: భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ ఖండించారు. మంత్రి హోదాలో ఉండి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని వెంటనే కేటీఆర్‌కు మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలను, రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలకు వాడుకోవద్దనే విషయం మంత్రికి తెలియదా అని ప్రశ్నించారు.

'జీరో ఎల్‌ఆర్‌ఎస్ అమలు చేయండి'

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికార పక్షంలో మరోమాట మాట్లాడుతున్నారని మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పాల సాయిరాం అన్నారు. ప్రభుత్వం వెంటనే జీరో ఎల్‌ఆర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రజలకు ఎల్‌ఆర్‌ఎస్ గుదిబండలా మారిందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి జీరో ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేయాలని లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో 30 వేలు, సుడా పరిధిలో 24 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. భూపేశ్, నందిని శ్రీనివాస్, తదితరులున్నారు.

మైనంపల్లిపై తొగుట ఠాణాలో ఫిర్యాదు

తొగుట, న్యూస్‌టుడే: మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుపై బుధవారం భారాస నాయకులు తొగుట ఠాణాలో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడారు. మల్లన్నసాగర్ నిర్వాసిత గ్రామాల్లో మైనంపల్లి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలు తుక్కాపూర్, తొగుట తదితర గ్రామాల ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారాస మండలాధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీలు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోండి


ప్రారంభోత్సవంలో పాల్గొన్న యూబీఐ సీజీఎం భాస్కరరావు, రీజినల్ అధికారి వికాస్, ఇతర సభ్యులు

సిద్దిపేట, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని యూబీఐ సీజీఎం(చీఫ్ జనరల్ మేనేజర్) కె.భాస్కరరావు, రీజినల్ అధికారి ఈద వికాస్ సూచించారు. యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ నూతన భవనాన్ని బుధవారం వర్చువల్ విధానంలో ముంబాయి నుంచి యూబీఐ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో మణిమేఖలాయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్దిపేటలో హాజరైన భాస్కర్‌రావు, వికాస్ మాట్లాడుతూ.. అత్యాధునిక సదుపాయాలతో భవనం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఎనిమిదేళ్ల వ్యవధిలో 5400 మందికి ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఉచిత భోజనంతో పాటు వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. ఎల్‌డీఎం హరిబాబు, డైరెక్టర్ రాజలింగం, శిక్షకులు నజీమ్, బ్యాంకుల అధికారుల పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

బోయినపల్లి, న్యూస్‌టుడే: సిరిసిల్ల-కరీంనగర్ ప్రధాన రహదారిలోని కొదురుపాక నాలుగు వరుసల వంతెనపై నుంచి మధ్యమానేరు జలాశయం బ్యాక్‌వాటర్‌లో దూకి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేటకు చెందిన సంచ్చీ-జీజీవ్‌కుమార్ నాలుగు వరుసల వంతెన రక్షణ గోడకు ఏర్పాటు చేసిన జాలీపైకి ఎక్కి జలాశయంలో దూకడానికి ప్రయత్నిస్తున్నాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి ఆత్మహత్య చేసుకోవద్దని సూచించారు. ఉపాధి చూపిస్తామని, ఆలోచన విరమించుకొని జాలీ ఎక్కి వంతెనపైకి రావాలని కోరడంతో వచ్చాడు. ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నానని, తన బంధువు తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోగా తిట్టినట్లు చెప్పాడు. దీంతో చీ-జీజీవితంపై విరక్తి చెందిన ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు తెలిపాడు. సంచ్చీ-జీజీవ్‌ను కాపాడిన వారు అతడికి డబ్బులు ఇచ్చి సిద్దిపేట వెళ్లాలని సూచించి బస్సు ఎక్కించి పంపించారు.

ప్రయాణ ప్రాంగణం.. నిరుపయోగం



ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించడంలో భాగంగా 25 ఏళ్ల కిందట మిరుదొడ్డిలో నిర్మించిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం నిరుపయోగంగా మారింది. ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు, కంప చెట్లు పెరిగి అపరిశుభ్రంగా తయారైంది. రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నప్పటికీ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఆవరణలో నిర్మించిన మూత్రశాలలు అధ్వానంగా మారాయి. బస్టాండు ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపైనే నిలబడుతున్నారు. గతేడాది బస్టాండును పరిశీలించిన ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని, ఇప్పటికైనా స్పందించి మౌలిక వసతులు కల్పించాలని మండలంలోని ప్రయాణికులు కోరుతున్నారు. **న్యూస్‌టుడే, మిరుదొడ్డి:**

కస్తూర్బా బాలికలకు కష్టాలు


భోజనాల గదిలో ఒకవైపు బోధన, మరోవైపు సిలిండర్లు, బియ్యం బస్తాలు

న్యూస్‌టుడే, దుబ్బాక: దుబ్బాక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో వసతులు కరవయ్యాయి. ఫలితంగా 200 మంది బాలికలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇక్కడ 22 మంది బోధన, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఇరుకైన ఐదు తరగతులు మాత్రమే ఉండడంతో భోజనశాల గదిని మరో తరగతిగా మార్చారు. ఆ గదిలో వెనుక వైపు సిలిండర్లు, బియ్యం బస్తాలను నిల్వ చేశారు. ఒక్కోసారి పాఠశాల ఆవరణలో పాఠాలు చెబుతున్నారు.

మంచాలు లేక..

పాఠశాల పై అంతస్తులో శిథిలావస్థకు చేరిన 4 గదుల్లో ఏర్పాటు చేసిన డార్మెటరీల్లో మంచాలు లేక బాలికలు నేలపై నిద్రిస్తున్నారు. ప్రహరీ అసంపూర్తిగా ఉండడంతో పందులు, కుక్కల సంచారం ఎక్కువైంది. సౌర విద్యుత్తుకు సంబంధించిన బ్యాటరీలు పూర్తిగా చెడిపోయాయి. సెప్టిక్ ట్యాంకు నిండి దుర్వాసన రావడంతో ఇబ్బందులు పడుతున్నట్లు బాలికలు వాపోతున్నారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో రాత్రిపూట పోలీస్ పెట్రోలింగ్ పూర్తి స్థాయిలో జరగడం లేదని చెబుతున్నారు.

రూ.67.50 లక్షలతో పనులు

పాఠశాలలో వసతుల కొరత, ఇతర సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం రూ.67.5 లక్షలతో రెండు అదనపు తరగతి గదులు, ప్రహరీ, శౌచాలయాల నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించింది. టెండర్ ప్రక్రియ పూర్తి కాకముందే, 8 నెలల క్రితం హడావిడిగా అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, చేతులు దులుపుకున్నారు. నెల రోజుల క్రితం జిల్లా కలెక్టర్ మనుచౌదరి పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి సమస్యలు తెలుసుకొని పనులు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. దాంతో నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ ఇటీవల పూర్తయింది. ఇదే విషయమై సిద్దిపేట ఈడబ్ల్యూఐడీసీ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయింది. దసరా తర్వాత గుత్తేదారు పనులు చేపట్టనున్నారని తెలిపారు.

లాల్‌బహదూర్ శాస్త్రి సేవలు మరువలేనివి


సిద్దిపేటలో లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, తదితరులు

సిద్దిపేట అర్బన్, దుబ్బాక, మిరుదొడ్డి, న్యూస్‌టుడే: నీతి, నిజాయతీకి నిలువుటద్దం లాల్‌బహదూర్ శాస్త్రీ అని, ఆయన దేశానికి చేసిన సేవలు మరువలేనివని భాజపా జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి అన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా సిద్దిపేటలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు విద్యాసాగర్, నరేశ్, దినేష్, వెంకట్, తదితరులు ఉన్నారు. దుబ్బాక పట్టణంలో, మిరుదొడ్డి మండల కేంద్రంలో యువకులు, గ్రామస్థులు శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హుస్నాబాద్‌లో భారీ వర్షం

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ పట్టణంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అప్పటివరకు తీవ్రమైన ఎండతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. నాలుగు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఆకాశం మేఘావృతమై దాదాపు గంటపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. 13 మి.మీ. వర్షపాతం నమోదైంది.

టీటీసీని వినియోగంలోకి తేవాలి

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లో రూ.కోటితో నిర్మించి నిరుపయోగంగా ఉన్న టీచర్ ట్రైనింగ్ సెంటర్(టీటీసీ)ను వినియోగంలోకి తీసుకురావాలని గణిత ఉపాధ్యాయ ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు మల్కిరెడ్డి మోహన్‌రెడ్డి కోరారు. బుధవారం హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల ఎంఈవోలుగా బాధ్యతలు చేపట్టిన మనీలా, రంగానాయక్‌లను ఫోరం సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ భవన నిర్మాణానికి ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి తన కోటా నుంచి రూ.కోటి కేటాయించారన్నారు. నిర్మాణం పూర్తయి నాలుగేళ్లయినా నిరుపయోగంగా ఉందన్నారు. హుస్నాబాద్ అక్కన్నపేట గణిత ఫోరం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

రెయిలింగ్ లేక.. రక్షణ కరవై



పట్టణంలో సుందరీకరణ కోసం ఏర్పాటు చేసిన ఓ ఫౌంటేయిన్ ప్రమాదకరంగా మారింది. హైదరాబాద్ రోడ్డులోని బీజేఆర్ విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన ఫౌంటేయిన్ చుట్టూ ఉన్న గోడ తక్కువ ఎత్తు ఉండటం వల్ల రాత్రిపూట తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధాన కూడలి కావడంతో ఫౌంటేయిన్ చుట్టూ ఉన్న గోడ ఎత్తు పెంచాలని లేదా చుట్టూ రెయిలింగ్ ఏర్పాటు చేసి వాటికి రేడియం దీపాలు అమర్చితే ప్రమాదాలు నివారించవచ్చని స్థానికులు కోరుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. **- న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్**

గుడుంబా స్వాధీనం

బెజ్జంకి, న్యూస్‌టుడే: మండలంలోని తోటపల్లి శివారులో గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి 14 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై క్రిష్టారెడ్డి బుధవారం తెలిపారు. గన్నేరువరం మండలం గునుకులకొండాపూర్ గ్రామానికి చెందిన నారాయణ తోటపల్లి శివారులోని కోళ్లఫారంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. తన గ్రామంలోని పంట పొలాల్లో గుట్టుగా గుడుంబా తయారు చేసి తోటపల్లి శివారులోని ఓ ఫీడ్స్ కంపెనీలో పనిచేసే కూలీలకు విక్రయిస్తున్నారు. స్థానికుల సమాచారంతో ఎస్సై తన సిబ్బంది దాడిచేసి నారాయణను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

అదనపు పీపీగా కుమారస్వామి

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేట మండలం అంతకపేటకు చెందిన న్యాయవాది పంజాల కుమారస్వామి కరీంనగర్ జిల్లా కోర్టులోని మొదటి పోక్సో కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. కుమారస్వామి 2005 నుంచి జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆయన ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా కుమారస్వామి నియామకంపై అంతకపేట గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.